# ★ వెదుకబోయిన తీగె ★

ఇప్పుడే కాలేజీనుంచి భాస్కరం రూమ్‌కు చేరుకున్నాడు. తలుపు తెరచేటప్పటికి అంతకు ముందే తలుపు సందులోంచి పోస్ట్‌మెన్ పడేసిన కవరు కనబడింది—

"..........చిరంజీవి భాస్కరానికి.

ఎన్ని జాబులు వ్రాసినా సమాధానం యివ్వడం లేదు. నేను ముసలివాడినయిపోయాను. ఈ ముసలి ప్రాణం గుటుక్కుమనకుండా నీవో యింటివాడి వయ్యావంటే మాకు కావలసింది ఏమిటి చెప్పు! సంతోషంగా నీకు బిడ్డలు పుడితే చూసుకుని మురియడం గాని?—

"అమ్మ ఎంత ఇదవుతూందనుకున్నావు? నీతోటి వాళ్ళందరికీ పెళ్ళిళ్ళయి — పిల్లలతో సంతోషంగా వున్నారని—నా వాడు యింకా యిల్లాగే వున్నాడని" —చాలా బాధ పడుతూంది. మొన్ననే చక్కని సంబంధం ఒకటి వచ్చింది. పిల్ల రంగానూ—అందరగానూ ఉంటుందని మాడా తెలిసింది—పిల్ల చదువుతూందట కూడాను. యిద్దరికీ ఈడూ జోడూగా వుంటుందట.. మరెప్పు నా మాటకు అడ్డు చెప్పక వెంటనే నాలుగు రోజులు కాలేజీకి శలవు పెట్టి—ఇంటికి రా! అన్నివిషయాలూ మాట్లాడుకో వచ్చును. తప్పక బయలుదేరి వస్తావని తలుస్తాను! వస్తావు కదూ...?—"

ఆశీస్సులతో
తండ్రి—వీరయ్య

ఉత్తరం చదువుకున్నంత సేపూ భాస్కరం మనసో ప్రపంచంలో వున్నాడు—తనకు వివాహం! ఎలాగ!! ఇంత క్రితమే సుశీలకు మాట యిచ్చాడు. సుశీల ఆనాటి మాటలు భాస్కరం హృదయంలో గజ్జెలు కట్టి నాట్యం చేస్తున్నాయి. కళ్ళముందర సుశీల ఎర్రని పెదిమలు నిగనిగ మెరుస్తూ, నవ్వులు కురుస్తున్నాయి.—చెవుల్లో స్వాగత గీతికల ధ్వనులు వినబడుతున్నాయి—సుశీల! అదిగో!! ఎదురుగా కనిపిస్తూంది. "నన్ను తప్ప యింకొకరిని వివాహమాడను"—భాస్కరం ఉత్తరాన్ని క్రింద పడేశాడు. నిర్జీవ ప్రతిమలాగ నిలుచున్నాడు. అనేక ఆలోచనలు కళ్ళముందు కరాళ నాట్యం చేస్తున్నాయి. ఏమిటో! ఏవో ప్రశ్నలు అడుగుతూన్నట్లు బాధ పడుతున్నాడు. "ఏది ప్రేమా? ప్రేమంటే నీ వాంఛ చల్లార్చగల శక్తి అనేనా నీ వూహ! నీ కళ్ళముందర కనబడిన స్త్రీనిన్ని, నీ అంతరంత వాంఛల ఒత్తిడితో చూసి, కావాలని కోరి, నీ వాంఛా ఫలసిద్ధికై "ప్రేమ"— అని నాటకరణం వేస్తున్నావా?"— భాస్కరం నరాలు ఉప్పొంగాయి. కళ్ళు కణకణ మండుతున్నాయి.

"మాట తప్పడం నాగరిక లక్షణం అనిపించు కుంటుందా?"—అంతరాత్మ ప్రశ్నించింది!

అది ఎన్నటికీ కాదు! ప్రతిఫలాపేక్ష లేని ప్రేమే నిజమైన, ఆదర్శమైన ప్రేమ."— భాస్కరం అంతరాత్మ ప్రతిగా సమాధాన మిచ్చింది.

దసరా సెలవులకు సుశీలా, తనూ వెళ్ళినప్పుడు చేసుకున్న ప్రతిజ్ఞలు మరువ గలడా?—ఒకవేళ మరచినా ఆకాశాన నెలరాజు ఆ జంటను తన నిండు హృదయంతో ఆశీర్వదించాడే:—

అవును! "చందమామ సాక్షిగానే కదూ సుశీల చేతిలో భాస్కరం చెయ్యివేసింది"—తన పాత అనుభవాలను కళ్ళముందుకు తెచ్చుకున్నాడు భాస్కరం! వెంటనే ఒక నిశ్చయానికి వచ్చాడు!— బయలుదేరి

## 'ఎల్లోరా'

తన తండ్రితో "యీ వివాహం పల్లకాదని చెప్పాలి" —అని.

* * *

సుశీల భాస్కరం క్లాసుమేటులు కాదు గాని ఒకే కాలేజీలో చదువుకుంటున్నారు. ఇద్దరూ ఒకే జిల్లావారు—సకల కళలకూ నిలయమై; నందనోద్యాన వన సౌందర్య శోభితమై ప్రకృతి సంపదకు ఖనియై; గోదావరీ ముఖాన వున్న కోనసీమ వారి మనుమలే. ఇద్దరూ కోనసీమ కోటి మెరక కొబ్బరి తోటల కోతి కొమ్మచ్చు లాడిన వారే!

ఒక రోజున కాలేజీలో వక్తృత్వ పోటీ జరుగుతూంటే తనూ పాల్గొందామని వెళ్ళింది సుశీల. ఉపన్యాస వేదికమీద ఒక యువకుడు.— "స్త్రీకి విద్య ఎంతదాకా అవసరం" — అనే విషయం మీద చాలా గంభీరంగా మాట్లాడుతున్నాడు!సుశీలనుకూడా మాట్లాడమని తోటి ఆడ పిల్లలు ప్రోత్సహించారు— గుండె దిటవు చేసుకుని సుశీల కూడా మాట్లాడింది. ఆ టాపిక్ మీద చాలా బాగా మాట్లాడిందని సుశీలను అందరూ అభినందించారు. అందరితోపాటు భాస్కరం కూడా వచ్చి—"చాలా బాగా మాట్లాడా వనీ, స్త్రీ లోకంలో—ముఖ్యంగా విద్యార్థినీ లోకంలో ధ్రువతారవై మార్గదర్శకురాలవు కాగలవని ఆశిస్తున్నా"నని చెప్పాడు.

భాస్కరం వేదికమీద గంభీరంగా ఉపన్యసిస్తూ—తన మేధాశక్తి చేత అందరినీ ఆశ్చర్య చకితులను చేస్తూన్నప్పుడే సుశీల లేత హృదయంలో ప్రథమంగా ఆనందం చిందులు త్రొక్కింది—ఆ ఘడియనుంచే సుశీలకు భాస్కరంమీద గౌరవ పూర్వకమైన ప్రేమ జనించింది. భాస్కరుని కిరణాలు సుశీలను తాకి మెరు పెక్కించినవి. భాస్కరం హృదయంలో ఆనందం జలకమాడింది!

ఆరోజునుంచి ప్రతి విషయంలోనూ సుశీల భాస్కరంవద్దకు వస్తూ పోతూ వుండడం—కల్చరల్ యాక్టివిటీస్‌లో భాస్కరంతో కలసి పాల్గొంటూండడం కూడా జరుగుతూండేది.

ఇల్లాగ వుండగా—"దసరా శలవులకు బయలుదేరి రాజమండ్రి తప్పక రావలసింది" అని అక్కడినుంచి సుశీలకు లేఖ వచ్చింది. అంతవరకూ భాస్కరంమీద తనకున్న గౌరవభావంగానే వుంది ఆ ప్రేమ! కాని చంద్రకళ దశల మాదిరి అభివృద్ధికి కూడా మేలు లేకపోలేదు.

తను బయలుదేరి వెళ్ళడం— అందులోనూ ఒక్కసుశీలకు చాలా కష్టంగా కనుపించింది. అందుకు భాస్కరాన్ని తన వూరు రమ్మని సాభిప్రాయపూర్వకంగా—మిత్రత్వపు అధికారంతో — ఆహ్వానించింది.

భాస్కరం! ముందర నీవు ససేమిరా, నాకేవో పను లున్నాయని వంకలు చెప్పి తప్పించుకోవాలని చూసినా సుశీల పెదిమలనుండి — "ఏం భాస్కరం!" — అన్న ఆశాపూరిత ధ్వని వినేటప్పటికి తనకు తెలియకుండానే అంతరంతంలోంచి వసంత ఋతు పిల్లగాలి ప్రశాంత ధ్వనిలాగ—"సరే!"—అన్న సమాధానం వచ్చింది.!

సుశీల ముఖం ఆ సమయంలో మెరిసి, వెలిసి వెన్నెలలు కురిసింది!

* * *

చందమామ ఆకాశంలో ముఖం చాలా పెద్దగా చేసుకుని నీలి మేఘాలతో దోబూచులాడుతున్నాడు— ఆరోజు పూర్ణిమే అయివుంటుంది.

భోజనాలు పూర్తయ్యాయి! అప్పుడే కడుతూన్న కొత్త డాబామీద భాస్కరానికి, తనకు పక్కలు వేసింది—సుశీల. డాబా క్రింది గదిలో సుశీల చెల్లెలు లక్ష్మి మేనమామ కూతురు పిల్లి పక్కలు వేసుకుని వాళ్ళ...అగ్రహారం గొడవలు, స్కూలు గొడవలూ మాట్లాడుకుంటున్నారు.

ప్రకృతి చాలా ముభావంగా వుంది! అప్పుడప్పుడు గోదావరి బ్రిడ్జిమీద నడిచే ధూము శకటాల రణగొణ ధ్వనులు తప్ప.

భాస్కరం జీవిత పయనంలో సుశీలతో ఏకాంతంగా స్త్రీతో ఇంత చనువుగా కలసి మాట్లాడడం ఇదే ప్రథమం. సంఘం, సమాజం తనను అనుమానించి హింసిస్తుందేమోనని తనలో కొంచెంగా పిరికి వున్న భీతి భయంతో వెనకకు లాగుతూంది; బూజు పట్టిన సంఘ మర్యాదలకు బానిసత్వం వహించక విశాలతతో ముందుకు నడు—" బలంగా అంతరాత్మ ఉత్సాహ పూరితుణ్ణి చేసింది!

"సుశీ"— ఒక పిలుపు పిలిచాడు విశ్వాస్నిభంగ పరుస్తూ భాస్కరం!

అంతవరకూ ఏదో ఆలోచిస్తూన్న సుశీల ఆశ్చర్యంగా భాస్కరం వంక చూస్తూ కళ్ళతో భాస్కరాన్ని

పలకరిస్తోంది! గులాబీ రేకుల లాంటి సుశి పెదిమలు "కొత్త" అనే వణుకుతో విడివడిపోయాయి.

"భాస్కరం! రెండవసారి— మనం పరీక్షలకోసం చాలా శ్రద్ధగా చదవాలి. నీవు వ్రాసి నా పుస్తకంలో వుంచిన నీ అంతరాత్మ సాక్షీభూతమైన ఉత్తరాన్ని చూశాను! ప్రతి అక్షరం నన్ను కితకితలు పెట్టాయి. ప్రతి వాక్యం నాలో నవ్వులు వర్షించాయి. నీ సంతకం నన్ను ప్రేమగా పలకరించింది! సుశీ!—" అన్నాడు.

ఈ మాటలకు సుశీల—సిగ్గుతో తల వంచేసుకుంది!—

"సుశీ! నీ ఉత్తరంలో మనం వివాహం చేసుకుందాం ..." అని అడిగావు? సంతోషం! కాని యిది సమయం కాదని నావూహ. మన స్టడీస్ పూర్తిఅయ్యాక ఏమైనా ఆలోచిద్దాం! అంత దాకా..." అన్నాడు భాస్కరం. ఆమాట నోటితో తెగించి చెప్పడానికి ఆలోచించి, సిగ్గు, కొత్త, భయం అనే మూడుశక్తుల ఒత్తిడితో లోలోపల ఒణికిపోయాడు!

"అంతదాకా ఆగడం ఎందుకు?"—సుశీల అడిగింది.


"అది అంత బాగా వుండదు! స్టడీస్ పూర్తి అయ్యాక...!"

అన్నాడు భాస్కరం భవిష్యత్తు కేసి ఆశతో చూస్తూ!

సుశీ ఏమీ మాట్లాడ లేదు!

ఇంకా ఏమిటో ఆలోచిస్తున్నావు సుశీ?—

"ఇదిగో! సుశీ? ఆ చంద్రుని తోడుగా నీకు మాట యిస్తున్నాను—భాస్కరం బొందిలో ప్రాణం వుండగా యింకెవరినీ వివాహం చేసుకోడని! తెలిసిందా? యిదిగో చేతిలో చెయ్యి"—ఒకరి చేతిలో ఒకరు చెయ్యి వేసుకుని, ఒకరిహృదయంలో ఒకరు ప్రతిజ్ఞాపత్రంలో సంతకాలు చేసుకుని, ఒకరి ఆశయంలో ఒకరి ఆశయాన్ని జతచేసి, తను అంతర్గతశక్తుల ప్రోత్సాహంతో ఒక నిర్ణయానికి వచ్చారు—దసరా శలవలు పూర్తి అయ్యాయి. మద్రాసు తిరిగి యిద్దరూ చేరుకున్నారు. ఇదీ భాస్కరం ప్రథమ పరిచయం.



"భాస్కరం బొందిలో ప్రాణం ఉండగా ఇంకెవరినీ చేసుకోడు."

* * *

సుశీలకు కూడా భాస్కరానికి జాబు వచ్చిన సమయంలోనే—ఒక్క[illegible] రెండు రోజులు అటూ ఇటూగా ఉత్తరం వచ్చింది.

"పెళ్లివారు చూసుకోడానికి వస్తున్నారనీ, పెళ్లి మాటలు జరుగుతున్నాయనీ, రెండు, మూడు దినాలు శలవు తీసుకుని బయలుదేరి రావలసిందని!"—

తల్లిదండ్రులు పెళ్లి చూపులకు రమ్మని వ్రాసిన జాబు చదివేటప్పటికి ముచ్చెమటలు పోశాయి సుశీలకు! "పాపాలకు ప్రతిఫలంగా చీము, నెత్తురుల కలయికతో ప్రవహించే వైతరిణీ నదిలో ఈదులాడుతున్నానా?" అని తనలో తాను భయపడిపోయింది. కోటి అమావాస్య చీకటి రాత్రులు మీద కురిసినట్లుగా వణకసాగింది!

ఏం చెయ్యడానికీ తోచక వెంటనే భాస్కరం రూముకు బయలుదేరింది సుశీల. తను వెళ్లేటప్పటికే భాస్కరం కాలేజీనుంచి ప్రయాణమై తన స్వగ్రామం వెళ్లిపోయాడు.

ఏ విషయం వున్నా భాస్కరం సుశీలకు తెలియకుండా వెళ్ళేవాడు కాదు! — కాని యీనాడు? పెళ్ళిచూపుల విషయం! సుశీలకు యీ విషయం తెలిస్తే ఏం బాధపడుతుందో? ఏం అభిప్రాయపడుతుందో అనే భయంతో, అభిప్రాయంతో సుశీలకు తెలియకుండా—రహస్యంగా బయలుదేరి వెళ్ళాడు!

భాస్కరం చెప్పకుండా వెళ్లినందుకు సుశీల చాలా బాధపడింది! ఈ సమయంలో లేకపోయినందుకు నిరుత్సాహంతోటే తన గ్రామం బయలుదేరింది సుశీల!

"గాలిపడగ ఆకాశ వీధిలో రివ్వున ఎగురుతూంది! ఆకాశ తారకల్ని ముద్దెట్టుకుంటోంది. అరుణకాంతుల జిమ్ము మేఘాల మధ్యన తన అందాన్ని చూసుకుని మురిసి నాట్యమాడుతోంది!"— రైలు బండి కిటికీ లోంచి సుశీలకు కనబడిన ఒక దృశ్యం!

కొంచెంసేపు దృష్టి మరలించిన సుశీల తిరిగి కిటికీ లోంచి అదేవంక చూస్తోంది—ఆ గాలిపటాలలాగానే తను—తన ఆశయాలూ హిమగిరివరకు ఎదిగి పతించ బోతున్నాయని ఎన్నో గాలిమేడలను కట్టుకుంది. వీటికి కలలను కని—తాత్కాలిక ఆనందాన్ని పొంది—తనూ గగనవీధిలో ఆనందంతో—ఆహ్లాదంగా విహరిస్తోంది!

ఇంతలో గాలిపటాల దారం తెగి క్రింద పడిపోవడం దృశ్యం కానొచ్చే టప్పటికి తన జీవితం కూడా గుబురుగా అగాధంలోకి ... త్వరలో ఏ ఏర్పాటు చేసేస్తుందేమోనని భయపడిపోయింది.

తన తల్లిదండ్రులు పెళ్ళికి ఏర్పాటు చేస్తున్నారు. పెళ్ళిచూపులకు రమ్మని బాబు కూడా వ్రాశాడు! ఏవరోకి ఏర్పాట్లు?—ఏ విధంగా ఈ సమయంలో భాస్కరం మాటను చెల్లించడం?—అనుకుంటూండ గానే ధూమశకటం పొగలు చిమ్ముకుంటూ గోదావరి స్టేషన్‌లో ఆగింది. అంతవరకూ అంతరంగ పోరాటంలో పెనగిస్తున్న సుశీల ఒక్కసారిగా లేచి బరువెక్కిన హృదయంతో బండినుండి దిగింది—మెల్లగా నిరుత్సాహంతో యిల్లు చేరుకుంది!

* * *

ఇక తెల్లవారితే పెళ్ళిచూపులు!

సుశీలలో నిరుత్సాహం కన్న తల్లికి కనపడ సాగింది—

"ఏమే! సుశీలా? అలాగ వున్నావు?" అని సుశీలను చూసి అనుమానంతో వుండలేక కన్నతల్లి మాటల సందర్భంలో అడిగింది!

లేని మెలకువను తెచ్చుకుని— "అబ్బే! ఏంలేదు; ప్రయాణం బడలిక"— అంది ముభావంగా సుశీల!

ఈసమాధానం తల్లికి సంతృప్తి కలిగించకపోయినా—విసిగించడం యిష్టం లేక— అంతటితో ఆ విషయాన్ని మళ్ళించింది తల నెరసిన సుశీల తల్లి!

సుశీలకు పెళ్ళి సంబంధం వెదుక్కొచ్చింది—తన పినతండ్రి వెంకట్రామయ్యగారు! వారి యింటనే—రాజమండ్రి కిరెండుమైళ్ళ దూరంలో వున్న ధవళేశ్వరంలోనే పెళ్ళి చూపులకు స్థల నిర్ణయం కూడా చేశారు.

* * *

భాస్కరం ఇల్లు చేరుకున్నాడు!— "తనకు ఎంత మాత్రమూ ప్రస్తుతం వివాహం వద్దనీ, యింకా స్టడీస్ వున్నాయనీ, అందుకు పెళ్ళి ప్రయత్నాలు విరమించుకునని"— తల్లిదండ్రులను కోరాడు! ప్రాధేయపడ్డాడు కూడాను.

అందుకు వారు: "పిల్ల నచ్చితే అంత వరకూ ఆగి తరువాతే వివాహం చేసుకో నట్టానీ— పెళ్ళి చూపులకు ధవళేశ్వరం వెళ్ళవలసిందేనని"—చెప్పారు! కాదన లేక ధవళేశ్వరం వెళ్ళ మొక్కుబడి తీర్చ వద్దనుకుని బయలుదేరాడు భాస్కరం!

అక్కడ సుశీల: ఎలాగైనా ఈ బలవం తప్పు పెళ్ళి చూపులనుంచి బయటపడాలని—అందుకోసం ఏదో ఒక ఉపాయం ఆలోచించాలని"— మనసులో సుఖం యిజ్ఞం చేస్తోంది!

సుశీలను ధవళేశ్వరం పెళ్ళిచూపులకు సాగనంపుతూ "సుశీ! వచ్చే వాళ్ళు పెళ్ళి చూపులకు సుమా! చదువుకున్న దానిలాగ, చురుకుగా కనపడాలి"— అని బోధచేసింది తల్లి!

* * *

భాస్కరం ఈ పెళ్ళిచూపుల తంతంగం ఎప్పుడు ముగుస్తుందా? ఎప్పుడు బయటపడదామా? అనుకుంటూ బాధ పడుతున్నాడు!

"ఇంత వరకూ భాస్కరమే అని సుశీలకు— సుశీలే అని భాస్కరానికి తెలియదు! ఇద్దరూ మన సులో చాలా బాధ పడుతున్నారు. ఇద్దరం యీ రీతిగా యిక్కడ కలుసుకుంటున్నాం అని ఏ ఒక్కరికీ తెలియదు, ఈ ఘడియ వరకు!

సుశీల చక్కని ముస్తాబుతో పిన తల్లి బలవంతం మీద వచ్చి కూర్చుంది.

సామాన్యంగా స్త్రీలలో—అందులోనూ పెళ్ళి చూపుల సమయంలో—కనబరచే మొదటి గుణం— సిగ్గు! ఆ సిగ్గే సుశీలలో మెరిసింది.

సుశీల పెళ్ళి అనే వరదాలో కాదు అక్కడ కూర్చున్నది; సుశీల ఆనంద తరంగాలలో తేలియాడడం లేదు! ఈ ఘటులు బలవంతంగా తన మెడకు "పుస్తె" అనే పాశాన్ని వేయబోతున్నారనే మరణ వేదన పడు తూంది — గుండె ఆందోళనతో, ఆవేశంతో టప్పు టప్పున గోడ గడియారంలాగ ఫాస్ట్‌గా కొట్టుకుం టూంది. విలువ ఎక్కువ మెయిన్ స్ప్రింగు లాగ తన ఆశలు మధ్యలో—ఈ ఘడియలో తెగిపోయి తన జీవిత గమన గడియారాన్ని మూలకు నెట్టుతూన్నట్టు బాధ పడుతూ—కనుల నుండి వేడిగా అశ్రు కణాన్ని రాల్చింది; ఎవరైనా చూస్తారేమోనని తుడుచుకుని వణుకుతూన్న పెదిమలను పంటితో అణచి పెట్టు కుంది!—సుశీల.

"భాస్కరానికి యీ పెళ్ళి చూపులు, యీ తతంగం తెలిస్తే యేమనుకుంటాడో! ఏ విధంగా యీ తతంగంనుంచి బయట పడడం?"— అనుకుంటూ నలికిపోతూంది సుశీల!

"ఏం అమ్మాయి! ఎంత వరకూ చదువు కున్నావు —తల ఎత్తకుండా, వచ్చిని కంఠంతో మొక్కుబడి తీర్చుకోవడం కోసం ఒక ప్రశ్న, పెళ్ళికొడుకు హోదాలో వేశాడు భాస్కరం!

"ప్రస్తుతం...కాలేజీలో యింటర్ ఫస్టియర్ చదువుతున్నాను"—

"నీ పేరు?"— భాస్కరం రెండవ ప్రశ్న!

"సుశీల"— అంది ముఖాన్ని వంచేసుకుంటూ!

తను ప్రేమించిన అమ్మాయి పేరుకూడా సుశీలే! —ఆమాట వినేసరికి భాస్కరం హృదయం చిగురించింది; ముఖం వికసించింది!

పెళ్ళి చూపులకోసం అలంకరించబడివున్న సుశీల ననాయాసంగా గుర్తించడానికి వీలు లేకపోయినా ముఖం మాత్రం భాస్కరం గుర్తించక పోలేదు— నిజంగా సుశీలే! ముమ్మాటికీ సుశీలే!! పూర్తిగా నమ్మకం కలిగింది భాస్కరానికి—సంతోషం గట్లు తెగిన గోదావరిలాగ పరవళ్ళు తొక్కింది.

"సుశీ!"—అని గొంతెత్తి నోరారా పిలుద్దాం అనుకున్నాడు కాని అంత తొందరపడడం బాగుండదని నిర్ణయించుకున్నాడు-మనసుమాత్రం చిరు కేరింతాలు వేస్తూనేవుంది!

"మీపేరు భాస్కరం కదూ!"— అంది ఆమె పిల్ల తరపు పెద్దరికపు హోదాలో సుశీల పినతల్లి!

"అవును!" — అన్నాడు భాస్కరం. తిరిగి రెండవ ప్రశ్న వేయకుండానే—"నేను మద్రాసు... కాలేజీలో చదువుతున్నాను"— అన్నాడు సుశీలకు అర్థమయ్యేటట్లుగా.

అంతవరకు నిరాశతో కూరుకున్న సుశీలకు ఒక్క సారిగా ఆనందంతో ముఖాన్ని పైకెత్తి, కళ్ళతో చిరు నవ్వును చిలకరిస్తూ, పెదిమలతో భాస్కరాన్ని పలక రిస్తూ, చూపులతో కిటకిటలు పెట్టింది.ఒకరిని ఒకరు గుర్తించుకున్నారు వారిద్దరూ సైగలతో, హృదయాలు చిగిర్చాయని వేరే చెప్పడం దేనికి?—పెళ్ళి చూపులు పూర్తయ్యాయి.

"పిల్ల నచ్చిందని— తప్పక వివాహం చేసుకొని మీ కోరికను మన్నిస్తానని తండ్రితో చెప్పాడు భాస్కరం! అందుకు తండ్రికూడా యిష్టంగానే మాట్లాడాడు. కాని తల్లి మాత్రం—"పిల్ల తనకు ఎంత మాత్రం నచ్చలేదనీ, కాలేజీలో చదువుతూన్న పిల్లగానైనా కన్పించలేదని"— అంటూ అయిష్టతను అసంతృప్తినీ వెల్లడించింది.

పెళ్ళిచూపులు జరిపించిన సుశీల పినతండ్రి "పిల్లవాడు నాజూకుగా, బాగానే వున్నాడనీ, సుశీలకు అన్ని విధాలా తగిన వరుడు భాస్కరమే ననీ"— చెప్పాడు!

★

అప్పుడే భోంచేసి కూర్చున్నారు సుశీల తండ్రి!

"ఏమండీ! పిల్ల రేపు కాలేజీకి పోవాలి—ఏం ఆలోచించారు? ఏం నిర్ణయం చేశారు?"— అని అడిగింది సుశీల తల్లి భర్తను.

"భాస్కరం విషయం అన్నీ బాగానే వున్నాయి! నేనూ తప్పక అతనికే సుశీలను యిచ్చి వివాహం చేయాలని అనుకున్నాను. కాని యింతలో అసలు సంగతి తెలిసింది. వీరయ్య శర్మ అతని ధర్మమని వ్రాశాడు. ఎవరికి పట్టింది ఈ కలికాలంలో ముహూర్తాన్ని ఖర్చు చేసి సలహా యివ్వడానికి? అతడు చాలా మంచి వాడు కనుక గానీ!

ఇదిగో! ఉత్తరం—చదివి సరీ నోరు మెదపండి!" అంటూ ఆ ఉత్తరాన్ని భార్య ముఖంమీద పడేశాడు సుశీల తండ్రి!

ఈ వాతావరణం చూస్తూంటే రైలు క్రింద పడ్డ జీవ ప్రాణంలాగ కొట్టుకోసాగింది సుశీల ప్రాణం!

..."బ్రహ్మశ్రీ సుబ్బారాయుడు బావగార్కి... వీరయ్య శర్మ నమస్కరించి వ్రాయునది!

రెండు రోజుల క్రిందట మా పెద్ద చెరువులో సంధ్యావందనం చేసుకుంటూండగా—మీ సుశీలకు వివాహ ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, సంబంధం మా గ్రామంలోనే, భాస్కరం అనే క్షురకానికి నిశ్చ యించ బోతున్నారనీ, బట్టలు ఉతుక్కుంటూ చెప్పు

కుంటున్న ఆడవాళ్ల ద్వారా విన్నాను—చాలా ఆశ్చర్య పోయాను.

భాస్కరం అన్నివిషయాలలోనూ చాలాతెలివైనవాడు. —పరోపకారి—మంచి వాడు! అంత మాత్రంచేత సుశీలను అతనికి నిశ్చయించడం చాలా తొందర పనేమోనని నా నమ్మకం! ఎందుచేత నంటారా? అతని మీద సంఘానికి చాలా కక్ష వుందట—

ఇటువంటి పరిస్థితిలో రత్నంలాంటి సుశీలను అతనికి ముడేసి అమ్మాయి జీవితాన్ని భ్రష్టం చేయ వద్దని మిమ్మల్ని చాలా కోరుతున్నాను''—

ఇట్లు
వీరయ్య శర్మ.

ఆ వుత్తరం చదివిన సుశీల తల్లి ఏమనాలో, ఏం చేయాలో అర్థంకాక—వంట తడి పెట్టుకుంటూ లోనికి వెళ్లిపోయింది! సుశీల కూడా ఆ వుత్తరాన్ని పూర్తిగా చదివింది—బాధతో—సహించలేక చురచుర లాడిపోయింది.

''ఒకరు బాగుపడితే—సవ్యంగా వుంటే—హర్షించి ఆనందించలేని ఈ సంఘం సంఘమా?''— అని ఎంతో ఆవేశపడింది!

ఇంక ఒక్క నిమిషంకూడా ఇక్కడ వుండకూడదని అనుకుని బయలుదేరి వెళ్లిపోవడానికి నిశ్చయించింది సుశీల!

''ఏం సుశీలా!''— తండ్రి చాలా ఆప్యాయంగా పలకరించాడు.

''అమ్మో! నేను రేపు కాలేజీకి వెడుతున్నాను''—

''వెడుదువుగానిలే! ఇంత తొందర ఏమిటి?''—

''మూడు రోజులేకదూ నేను సెలవు పెట్టింది!''..

''సరే! అల్లాగే వెడుదువుగానిలే''— అన్నాడు తండ్రి.

కొంతసేపు పెదిమలను మెలిపెడుతూ నుంచుని సుశీల!

''ఏం నిశ్చయించారా...''—అని అంది సిగ్గు, బెదురుల సమ్మేళనంతో!

ఈ మాట సుశీల నోటినుండి పూర్తిగా బయటికి రాకుండానే తండ్రి!

''ఆ వూరునుంచి వచ్చిన ఉత్తరం చదివావనుకుం టాను! తెలుసుండీ, అతనికి చేతులారా వివాహం చేయడమా? చెయ్యను—చెయ్యలేను''— నోరు పెద్దది చేసుకుని కోపంగా అన్నాడు!

ఇలాంటి సమాధానం తన తండ్రినుండి వస్తుం దని తలవని సుశీల సహించలేక పోయింది.

''నాన్నా! క్షమించు! నీ బిడ్డ, గౌరవంగా బ్రతకా లంటే, నీ కళ్లకు కనిపించాలంటే ఈ వివాహానికి యిష్టపడండి''— అంటూ కళ్లనీళ్లు బొటబొటా కారుస్తూ బావురుమని తండ్రి పాదాల మీద పడింది—ఎరుపెక్కిన ముఖంతో.

తన కడుపున పుట్టిన సుశీల—తన కళ్ళ ముందరే ఎదురు తిరగడం—చూస్తూ ఏ తండ్రి ఊరుకోగలడని తనతో తాను ప్రశ్నించుకుని—వర సైనపోవలసివచ్చిందతనికి! ''ఏమైనా భాస్కరంతో సంబం ధము వల్లకాదు''— అన్నాడు— అదే తన నిర్ణయ మని నోరెత్తి మరీ గర్జించాడు!

* * *

సుశీల ప్రయాణం చేయకుని అప్పుడే పదిరోజులైంది. ఏదో నేరం తప్పిదం చేసినట్లు—భాస్కరాన్ని కన్నె త్తియినా చూడకుండా— బాధతో క్రుంగిపో సాగిం ఛంచింది. పుట్టింటికి ఒక్క జాబైనా వ్రాయలేదు— సుశీల వద్దనుంచి జాబు రానందుకు గుండె నిబ్బరంతో తండ్రి వూరుకున్నా కన్నకడుపు కాబట్టి తల్లిమాత్రం చాలా బాధపడింది!

ఆరోజు కాలేజీ మంత్లీ డిన్నర్! సుశీలా వచ్చింది. భాస్కరం కూడా హాజరయ్యాడు—మునుపటిమాది రిగా మాత్రం కాదు! ఇంత క్రితం డిన్నరు వచ్చిం దంటే ఒకే టేబిల్ ముందు కిచకిచలోటి సకసకల తోటి—యిద్దరూ ఎంతో ఆనందంగా సరదాగా వుంటూండేవారు! కాని యీనాడు? సుశీల ఒక మూల, భాస్కరం ఒక మూల, నిరుత్సాహంగా కూర్చున్నారు! నిజంగా ఆరోజు డిన్నరు వెలవెలా బోతున్నదనే చెప్పాలి!

డిన్నరు పూర్తయింది! ఎవరి గమ్యాలకు వారు చేరుకుంటున్నారు. భాస్కరం కూడా బలవంతంగా లేచి అడుసిరో అడుగు వేసుకుంటూ—ఆలోచనా నిమగ్నుడై — నడుస్తున్నాడు! — యింతలో: ''భాస్కర్!''—అని సన్నని స్త్రీ కంఠం వినబడింది! ఆ కంఠం పరిచయ కంఠమే. భాస్కరం దగ్గరగావచ్చి నుంచుంది! సుశీల—ఏదో మాట్లాడదామనే వచ్చింది —అంత వరకూ లేని సిగ్గు—భయమూ— అడ్డంగా నిలుచున్నాయి!

''ఏం సుశీ!''—అన్నాడు భారమైన శ్వాసను విడుస్తున్నట్లు భాస్కరం!

''......................................''

''పదే! రా!, రూముకు వెడదాం!'' అన్నాడు భాస్కరం: యిద్దరూ నడక ప్రారంభించారు.

''ఏం అలా భారంగా వున్నావు'?'—

''ఏం లేదు! బ్రతుకే భారంగావున్న యీ సమాజం ముందర సుశీల బ్రతికి ఏం లాభమా—అని ఆలో చిస్తున్నాను.''

''అవును! బూజుపట్టిన సంఘం ఎదు రీదు విరుచుకు పడుతూంటే చేతులు కట్టుకుని, నిస్పృ హతో—కూర్చోవడమేనా? సుశీ—కర్తవ్యం?...''

మానవుడు పురోగమించాలి! బూజుపట్టిన పాత సంప్రదాయాలను వెనుకకు నెట్టి—సంఘ పురోభి వృద్ధి కోసం ముందుకు నడవాలి—అమర కవి గురజాడ, వీరేశలింగం గార్ల అమర సందేశాలను గొంతెత్తి పాడుకుంటూ—ముందుకు చొచ్చుకు వెళ్లాలి!'' అని భాస్కరం తట్టి మేల్కొలిపాడు సుశీలను!

నిజంగా భాస్కరం పలికిన ప్రతి పలుకు—ప్రతి అక్షరం సుశీల హృదయంలో మధుర వసం తాన్ని వర్షించిందనే చెప్పాలి!

''సిగ్గు తెరల చాటునుంచి ఏం ఆలోచించారు''— అంది సుశీల!

''మన ఆలోచనలూ, నిర్ణయాలూ యింత క్రితమే జరిగినవి కదూ?''— అన్నాడు భాస్కరం!

భాస్కరం అన్న ఆశాపూరిత సమాధానానికి ఎంతో ఆనందపడింది సుశీల! ★

## అమాయకత్వం

డాక్టరుగారు తల్లి గురించి తండ్రితో చెప్పిన సలహా వింది ఆ రేళ్ళ కూతురు. ఉష్ణప్రదేశానికి మకాం మారిస్తేనేగాని ఆరోగ్యం సరికాదని డాక్టరు సలహా చెప్పాడు. వెంటనే ఆ పిల్ల దేవుడు దగ్గరకు వెళ్ళి యిలా ప్రార్థించింది.

'భగవంతుడా మా అమ్మను కాపాడు. మా అన్నను, చిట్టి తమ్ముణ్ణి కూడా కాపాడు. దయ యుంచి నాన్నగారికి అన్ని వస్తువులూ వేడిగా వుండేట్లు చెయ్యి.'


వేసవికాలంలో

మెదడును చల్లబరచుటకు, శిరోజములను నల్లబరచి కుదుళ్ళను బలపరచుటకు,

కేసరిగారి

భృంగామలక తైలం

వెల రు. 2-0-0

వాడిచూడండి

ఉత్పత్తిదారులు:

కేసరి కుటీరం లిమిటెడ్

రాయపేట, మద్రాసు-14.